క్లుప్తంగా

బధిరులకు దీపావళి సామగ్రి పంపిణీ



బాణసంచా, స్వీట్లు పంపిణీ చేస్తున్న టౌన్ హాల్ కమిటీ సభ్యులు

బోట్‌క్లబ్: దీపావళి సందర్భంగా స్థానిక సాంబ మూర్తి నగర్‌లో ఉన్న బధిరుల పాఠశాలలోని విద్యార్థులకు రూ.25 వేల విలువచేసే దీపావళి సామాన్లు, స్వీట్లు టౌన్ హాల్ కమిటీ సభ్యులు శనివారం ఉదయం పంపిణీ చేశారు. కమిటీ అధ్యక్షుడు వీవీఎస్ సత్యనారాయణ(ఆనంద్) మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం పరిపాటిగా వస్తోందన్నారు. తాము బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలి సేవా కార్యక్రమంలో భాగంగా సభ్యులు సహకారంతో నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రాజు, కార్యదర్శి వీవీ సుబ్రహ్మణ్యేశ్వరరావు(మాస్టారు) సంయుక్త కార్యదర్శి వైవీఎస్ నాయుడు, కోశాధికారి నెక్కంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి

కాకినాడ రూరల్: అంగన్‌వాడీ సెంటర్లలో మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తున్నట్టు రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా రమణయ్యపేట ఏపీ ఐఐసీ కాలనీలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బలవర్ధకమైన పోషికాహారం అందజేయడం ద్వారా శిశు మరణాలు తగ్గాయన్నారు. అనంతరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో సీడీపీఓ లక్ష్మి, ఎంపీడీఓ సతీష్, ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి, జిల్లా బాలల సంక్షేమాధికారి వెంకట్రావు, బీజేపీ నాయకుడు రంబాల వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


యోగా భారత్ ఫౌండేషన్ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

బోట్‌క్లబ్: యోగా భారత్ ఫౌండేషన్ (వైబీఎఫ్) కాకినాడ జిల్లా కార్యవర్గాన్ని ఫౌండేషన్ చైర్మన్ జ్యోతుల నాగేశ్వరరావు ప్రకటించారు. కాకినాడలో శనివారం జరిగిన సమావేశంలో కార్యవర్గ వివరాలను వెల్లడించారు. గౌరవ అధ్యక్షుడిగా కేవీకే కిషోర్, అధ్యక్షుడిగా జొన్నకూటి అప్పారావు, ఉపాధ్యక్షురాలుగా సూర్యకుమారి, ప్రధాన కార్యదర్శిగా పైన్ని సూర్యనారాయణ, కార్యదర్శిగా జేఎస్ఎన్ మూర్తి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా కాశీ మనోహర్, విజయలక్ష్మి, జాయింట్ సెక్రటరీగా విజయదుర్గ, కోశాధికారిగా శైలజతోపాటు కార్యవర్గ సభ్యులుగా డి.రామం, ఎన్.చైతన్య, కేవీ శేఖర్‌బాబు, వి.నాగరాజు నియమితులయ్యారు.

ఉపాధ్యాయిని కుటుంబానికి యూటీఎఫ్ తోడ్పాటు



గంగాభవానీ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కాకినాడ రూరల్: కొవ్వాడ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తూ ఇటీవల మృతి చెందిన గుత్తుల గంగాభవాని కుటుంబ సభ్యులకు యూటీఎఫ్ తోడ్పాటునిచ్చింది. గోదావరి యూటీఎఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా రూ.3 లక్షల చెక్కును రూరల్ ఎంఈఓ శ్రీనివాస్‌కుమార్ చేతుల మీదుగా శనివారం ఇంద్రపాలెం కాంప్లెక్స్ సమావేశంలో గంగాభవాని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ కుటుంబ సంక్షేమ పథకం ప్రధాన కార్యదర్శి గోవిందరాజులు, గిరిధర్ గోపాలరావు, దుర్గాదేవి, ఆవాల హరి, నాగరాజు, శ్రీనివాస్, సుగంధి, ఐజాక్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

పెద్దాపురం(సామర్లకోట): త్రిసభ్య కమిటీ ఆధ్వర్యంలో పెద్దాపురం పట్టణ పరిధిలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాలను శనివారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ సీఐ మాట్లాడుతూ ఎరువుల షాపుల్లో స్టాక్‌కు సంబంధించి రికార్డులు సక్రమంగా ఉండాలన్నారు. కొనుగోలు చేసిన ఎరువుల ఇన్‌వాయిస్, అమ్మకాలు చేసిన రసీదు పుస్తకాలు సక్రమంగా ఉండాలన్నారు. ప్రతి ఎరువుల షాపులోను లైసెన్సు డిస్‌ప్లే చేయాలని సూచించారు. షాపుల వద్ద నోటీసు బోర్డులో ఎరువుల ధరలతో పాటు నిల్వకు సంబంధించి వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఈ మేరకు ప్రతి రోజు తేదీలు ఉండాలన్నారు. నాణ్యత కలిగిన పురుగు మందులను మాత్రమే విక్రయించాలని సూచించారు. తహసీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మి, ఏఓ సంజీవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కష్టాలు



నడకుదురులోని తాగునీరందని కొత్తదిబ్బలు వీధి



12వ వార్డులోని వీధికుళాయి దుస్థితి

- చుక్క నీటికోసం సుదూరం వెళ్లాల్సిందే..
- నడకుదురులో అందని రక్షిత మంచినీరు
- మిథ్యగా మారిన జల్‌జీవన్ పథకం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

కరప: ఇంటింటికీ కుళాయిలు వేయించి తాగునీరందిస్తామంటున్న పాలకుల మాటలు ప్రకటనలతోనే సరిపెడుతున్నారు. ఇంటింటికీ కుళాయిల మాట దేవుడెరుగు వీధి కుళాయిలు కూడా వేయించడంలేదని ప్రజలు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక స్తోమత లేనివారు గొంతు తడుపుకోవడానికి సుదూర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చుకోవాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు. సంపద సృష్టిస్తామని ఊకదంపుడు ప్రసంగాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, ప్రజలకు మంచినీరు కూడా అందించలేకపోతోందని ఇదేమి పాలన అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాగునీరు కూడా కొనుక్కోవాల్సి వస్తోందని పేదవర్గాలు వాపోతున్నాయి. జలజీవన్ మిషన్ పథకం మిథ్యగా మారిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

మంచినీటి కొనుక్కోవాల్సిందే..

కరప మండలం నడకుదురులోని శివారు ప్రాంతాలకు రక్షిత మంచినీరందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామ శివారు ప్రాంతాలకు చుక్కనీరందక గొంతు తడుపుకోవడానికి కలుషిత నీరే శరణ్యమవుతోంది. అయినా ట్యాంకర్‌తో అయినా సరఫరా చేయడానికి కూడా చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. దాహార్తిని తీర్చుకోవడానికి మంచినీటిని కొనుక్కోవాల్సిన దౌర్భాగ్య స్థితిలో ఉన్నామని పలువురు విమర్శిస్తున్నారు. గ్రామంలో నిర్మించిన మంచినీటి ట్యాంక్ పాడైతే 2022లో అప్పటి మంత్రి కురసాల కన్నబాబు రూ.15 లక్షలు మంజూరు చేసి, మరమ్మతులు చేయించారు. గ్రామం విస్తరించి వీధులు, కాలనీలు పెరిగి గ్రామ జనాభా పెరిగింది. పెరిగిన జనాభాకు అనుగుణంగా మంచినీటి సరఫరా మెరుగు పడకపోవడంతో తాగునీటి కోసం గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీధి కుళాయిలు డమ్మీలుగా మారాయి. మంచినీటి గొట్టాలు డ్రైన్లలో నుంచి వేసి, డమ్మీ చేశారని ఆయా వార్డు ప్రజలు తెలిపారు.

ఏడాదిన్నరగా తాగునీరందక..

గ్రామంలో కొత్తదిబ్బల ప్రాంతంలోని 11, 12, 13, 14 వార్డుల్లో అయితే ఏడాదిన్నరగా తాగునీరందక ఆ ప్రాంత ప్రజలు మంచినీటికి కటకటలాడుతున్నారు. వీధి కుళాయిల నుంచి చుక్కనీరు రాకపోవడంతో అవి అలంకారప్రాయంగా మారాయి. జలజీవన మిషన్ పథకంలో ఇంటింటికీ కుళాయిలు వేయిస్తామంటున్నారే కానీ కొత్త దిబ్బలు ప్రాంతాన్ని ఎవరూ పట్టించుకోవడంలేదని ఆ ప్రాంత మహిళలు ఆరోపిస్తున్నారు. ఈ వార్డులకు పక్కనే ఉన్న కాలనీ రోడ్డులో కూటమి నాయకులు మాత్రం జలజీవన్ మిషన్ నుంచి కుళాయి కనెక్షన్లు వేయించుకుని, కొత్త దిబ్బలులోని వార్డుల్లో కుళాయి కనెక్షన్లు ఎందుకు వేయడంలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తాగునీరు కూడా అందించలేని అధికారుల, నాయకుల పనితీరును గామస్తులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, నాయకులు స్పందించి గ్రామంలోని 11, 12, 13, 14 వార్డులకు పూర్తిస్థాయిలో తాగునీరందించేందుకు చర్యలు తీసుకోవాలని కుళాయిలు వేయించేవరకు ట్యాంకర్‌తో తాగునీరు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దూరప్రాంతాలకు వెళుతున్నాం



కొత్త దిబ్బలు ప్రాంతంలోని మా వీధి కుళాయిలు చాలా కాలం నుంచి పనిచేయడం లేదు. చుక్కనీరు కూడా రావడలేదు. వీధి కుళాయిలు వేయించమని అడుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. మంచినీటిని కొనలేక, ఓపికలేకపోయినా దూరప్రాంతాల నుంచి తెచ్చుకోవాల్సి వస్తోంది. వీధి కుళాయిలు బాగుజేయించి, తాగునీరందించాలి.

– మాస గొంతెమ్మ, కొత్తదిబ్బలువీధి, నడకుదురు

కొన్ని ప్రాంతాలకే కుళాయిలు



కొత్తదిబ్బలు వీధిలో నాలుగు వార్డులు ఉన్నాయి. ఈ వార్డులకు ఏడాదిన్నర నుంచి తాగునీరందకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జలజీవన్ మిషన్‌లో కొన్ని ప్రాంతాల్లో ఇంటింటికీ కుళాయిలు వేశారు. ఈ ప్రాంతంలో కుళాయిలు వేయిస్తామంటున్నారే తప్ప వేయడంలేదు. వార్డుసభ్యుడిగా ఎన్నుకున్న ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నాను. పంచాయతీలో ఎప్పుడు అడిగినా ఎస్టిమేషన్లు వేయిస్తామంటున్నారు. తప్ప పనులు చేయడంలేదు. కనీసం వీధికుళాయిలు అయినా వేయించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. అంత వరకు ట్యాంకర్‌తో తాగునీరందించాలి.

– పోతల లోవప్రసాద్, వార్డుసభ్యుడు, నడకుదురు

వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు సహకరించాలి



వేళంగిలో వాయు కాలుష్యంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

కరప: ప్రజల ఆరోగ్య సమస్యలు పరిష్కరించేందుకు వాయు కాలుష్యాన్ని తగ్గించాల్సిన ఆవశ్యకత ఉందని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో, ఇంటి ఆవరణలో మొక్కలు పెంచడానికి ప్రాధాన్యతనిచ్చి, అందరూ సహకరించాలన్నారు. స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం వేళంగి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మొక్కల పెంపకం ఆవశ్యకత, పరిసరాల పరిశుభ్రతల గరించి ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పంచాయతీ, సచివాలయాల సిబ్బంది, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు, గ్రామస్తులతో కల్సి ర్యాలీ నిర్వహించారు. నిత్యానందపురం సెంటర్ వద్ద మానవహారంగా నిలబడి వాయు కాలుష్యం, ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు. డాక్టర్ బీఆర్ విగ్రహంవద్ద స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయం వద్ద ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసరావు మొక్కను నాటారు. గ్రామకార్యదర్శి పి.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు. కరపలో గ్రామకార్యదర్శి య.నిర్మలాదేవి గ్రామస్తులు, సిబ్బందితో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించి, వాయుకాలుష్యం, ప్రజల ఆరోగ్యసమస్యలపై అవగాహన కల్పించారు.

విద్యార్థుల సైకిల్ ర్యాలీ

బాలాజీచెరువు: స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పిఠాపురం రాజా ప్రభుత్వ కళాశాల ఆధ్వర్యంలో 'స్వచ్ఛమైన గాలి-సుస్థిర భవిష్యత్ అనే అంశంపై ప్రోగ్రాం ఆఫీసర్ జి.పావని శనివారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా దత్తత గ్రామమైన కొవ్వాడ ఉన్నత పాఠశాలలో గాలి కాలుష్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించి, విద్యార్థులతో సైకిల్ ర్యాలీ ప్రారంభించారు. అనంతరం 'స్వచ్ఛమైన గాలి – ఆరోగ్యకర జీవనం' అనే అంశంపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించి, అధ్యాపకులు, విద్యార్థులతో స్వచ్ఛ గాలి, స్వచ్ఛ పరిసరాల కోసం ప్రతిజ్ఞ చేయించారు. అలాగే పీఆర్ కళాశాలలో స్వచ్ఛమైన గాలి అనే అంశంపై సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కందుల ఆంజనేయులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు చురుగ్గా పాల్గొనాలని, గాలి కాలుష్యాన్ని తగ్గించే ప్రయత్నాలు ప్రతి ఒక్కరి బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వి.సంజీవ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్, ఎస్‌ఏఎస్‌ఏ కన్వీనర్ జి.పావని, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్ వద్ద మండల పరిషత్ కార్యాలయం వద్ద స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యాక్రమంలో భాగంగా శనివారం ఏర్పాటు చేసిన సైకిల్ ర్యాలీలో ఎమ్మెల్యే పంతం నానాజీ పాల్గొన్నారు. సైకిల్ వినియోగం అలవాటు చేసుకోవాలని ఆయన పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నన్నయ్య ఎంఎస్ఎన్ పీజీ సెంటరులో..

స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయా ఎంఎస్ఎన్ సీజీ సెంటరులో ఎన్ఎస్ఎస్ యూనిట్-1, 2ల ఆధ్వర్యంలో శుభ్రమైన గాలి, గాలి కాలూష్యం తగ్గించడం అంశాలపై అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థులను నాటిక ప్రదర్శించారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

ఆర్జేడీ నాగమణి



ఉపాధ్యాయినిలతో మాట్లాడుతున్న ఆర్జేడీ నాగమణి

కాకినాడ రూరల్: చదువుల్లో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు విద్యాశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు(ఆర్జేడీ) జి.నాగమణి సూచించారు. ఏపీఎస్పీ స్కూల్ కాంప్లెక్స్‌ను శనివారం మధ్యాహ్నం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా స్కూల్ కాంపెక్స్ సమావేశంలో పాల్గొన్న ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు కుటుంబ, ఆర్థిక, మానసికపరమైన సమస్యలు తెలుసుకుని విద్యాబుద్ధులతోపాటు పిల్లల భవిష్యత్ ప్రణాళికలను కూడా కార్యదీక్షతో తీర్చిదిద్దాలన్నారు. ఎఫ్ఏ–2 పరీక్షల సమాధాన పత్రాలను ఆమె పరిశీలించారు. వెంటనే పేపర్లు దిద్ది మార్కులు జాగ్రత్తగా వేయాలని సూచించారు. డి గ్రేడ్‌లో ఉన్న వారిని ఏ అంశంలో వెనకబడి ఉన్నారో గుర్తించి, వారికి రెమెడియల్ వర్క్ ఇవ్వాలన్నారు. నెలాఖరున పదవి విరమణ పొందుతున్న ప్రధానోపాధ్యాయురాలు కె.గాయత్రిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో చామంతి నాగేశ్వరరావు, సత్యవోలు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విడోస్‌హోం దుకాణాల స్వాధీనం



విడోస్ హోం దుకాణాన్ని స్వాధీనం చేసుకుంటున్న దేవదాయశాఖ అధికారులు

బోట్‌క్లబ్: దేవదాయశాఖకు చెందిన షాపును లీజుకు తీసుకుని అద్దె చెల్లించకపోవడంతో వాటిని దేవదాయశాఖ, రెవెన్యూ, పోలీసులు సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. స్థానిక మెయిన్‌రోడ్డులో దేవదాయశాఖకు చెందిన విడోస్‌హోంకు పలు దుకాణాలు ఉన్నాయి. ఈ దుకాణాలను ఐదేళ్ల క్రితం లీజు వేలం నిర్వహించగా నగరానికి చెందిన బలువూరి రామకృష్ణ దక్కించుకొన్నారు. సక్రమంగా అద్దెలు చెల్లించకుండా దేవదాయశాఖకు రూ.14 లక్షలపైగా బకాయి పడ్డారు. ఎన్నిసార్లు నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతో దేవదాయశాఖ నిబంధనలు ప్రకారం స్వాధీనం చేసుకున్నారు. దేవదాయశాఖ డీసీ డీఎల్‌వీ రమేష్‌బాబు, జిల్లా దేవదాయశాఖాధికారి కనపర్తి నాగేశ్వరరావు, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణీంద్రకుమార్, రెవెన్యూ, పోలీసులు సమక్షంలో షాపు తాళం పగులుకొట్టి, దానిలో వస్తువులు స్వాధీనం చేసుకొన్నారు. ఈ వస్తువులు రూ.5 లక్షలు లోపు ఉంటాయని, ప్రస్తుతం దుకాణదారుడు దీనిలో కళ్లజోళ్ల షాపు నడుపుతున్నట్టు జిల్లా దేవదాయశాఖాధికారి నాగేశ్వరరావు తెలిపారు. ప్రస్తుతం లీజుదారుడు రామకృష్ణ వడ్డీ కలిసి సుమారు రూ.20 లక్షలు వరకూ చెల్లించాలన్నారు. వస్తువులు వేలం నిర్వహించి మిగిలిన సొమ్ము ఇవ్వాలని నోటీసులు జారీ చేస్తామన్నారు. లేకుంటే కోర్టులో దేవదాయశాఖ నిబంధనలు ప్రకారం కేసు వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విడోస్‌హోం వ్యవస్థాపక చైర్మన్ పైండా రామకృష్ణారావు, సత్రం సీనియర్ అసిస్టెంట్ నాగబాబు పాల్గొన్నారు.

కుండపోత వర్షం

బాణసంచా వ్యాపారుల్లో గుబులు



సామర్లకోట స్టేషన్ సెంటర్‌లోని రోడ్డుపై వర్షపు నీరు

సామర్లకోట: ఒక్కసారిగా శనివారం రాత్రి కుండపోతగా వర్షం కురిసింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. వర్షం కురవడంతో బాణసంచా వ్యాపారస్తుల్లో గుబులు ప్రారంభమైంది. పట్టణ పరిధిలో 14, పెద్దాపురం పట్టణంలో 25, సామర్లకోట రూరల్ పరిధిలో 11, పెద్దాపురం రూరల్ పరిధిలో మూడు తాత్కలిక బాణసంచా షాపులు ఏర్పాటు చేశారు. ఊహించని విధంగా వర్షం కురియడంతో కొంత మంది షాపులో బాణసంచా తడిచిపోవడంతో ఆందోళనకు గురయ్యారు. వర్షానికి డ్రైన్లు పొంగి ప్రవహించడంతో డ్రైన్లలో నీరు రోడ్లపైకి చేరింది. స్టేషన్ సెంటర్, బస్సు కాంప్లెక్స్, జయలక్ష్మి థియేటర్ రోడ్డు, సత్యనారాయణ పురం రోడ్డు, సంపెంగతోట, వెలమపేట, రథంసెంటర్, షిర్డిసాయిబాబా రోడ్డు, వెలమపేట, సంగీతరావుపేట, సీతారామ కాలనీ, భాస్కర్‌నగర్, కాకినాడ రోడ్లు చెరువులుగా మారిపోయాయి. స్టేషన్ సెంటర్‌లో రోడ్లపై నీరు ఉధృతంగా ప్రవహించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అప్పయ్య చెరువు నుంచి డ్రైనులో నీటి ప్రవాహానికి సత్యనారాయణపురం రోడ్డు చెరువుగా మారింది. ఆ రోడ్డులో అడుగు అడుగునా గోతులు ఉండడంతో వాహనచోదకులు తమ వాహనాలను నడిపించుకొని వెళ్లారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి డ్రైన్ల ద్వారా ప్రవహించే నీరు స్థానిక స్టేషన్ సెంటర్‌లోని ప్రధాన డ్రైనులోనికి చేరుతుంది. అయితే ఆ డ్రైను నిండిపోవడంతో జయలక్ష్మీ థియేటర్ రోడ్డు, స్టేషన్ సెంటర్లు చెరువులను తలపించాయి. బస్సు కాంప్లెక్స్‌లోనికి నీరు చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

భక్తులకు అసౌకర్యం లేకుండా చూడాలి

- తహసీల్దార్ చంద్రశేఖరరెడ్డి
- కార్తిక మాస ఉత్సవాలపై సమావేశం



సమావేశంలో మాట్లాడున్న తహసీల్దార్ తదితరులు

సామర్లకోట: కార్తిక మాసంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి అన్నారు. శనివారం పంచారామ క్షేత్రంలో కార్తిక మాసంలో ఏర్పాట్లపై ఈఓ బళ్ల నీలకంఠం అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. ఆలయానికి వచ్చిన భక్తులు స్వామి వారిని, అమ్మవార్లను దర్శించుకునేలా అన్ని ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ సూచించారు. కార్తిక మాసంలో భక్తులు కోనేరులో స్నానాలు చేసే అవకాశం ఉన్న కారణంగా కోనేరులో నీరు శుభ్రంగా ఉండాలన్నారు. ఉచిత దర్శనంతో పాటు ఇతర దర్శనాలకు సంబంధించి క్యూలైన్లు ఏర్పాటు చేయాలన్నారు. పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారా రామభీమేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 22 నుంచి నవంబరు 20 వరకు నెల రోజుల పాటు కార్తిక మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. అమావాస్య వెళ్లిన మరుసటి రోజు నుంచి కార్తిక మాసం ప్రారంభమవుతుందన్నారు. 21వ తేదీ సాయంత్రం ఆరు గంటకు ఆకాశదీపంతో కార్తిక మాస ఉత్సవాలను ప్రారంభించి 22 నుంచి దర్శనాలు ఉంటాయన్నారు. నాలుగు ఆది వారాలు, నాలుగు సోమవారాలలో భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు. అదే విధంగా నవంబర్ 5న కార్తిక పౌర్ణమి, 6న కృతిక నక్షత్రంను పురస్కరించుకొని గ్రామోత్సవం ఉంటుందన్నారు. స్వామి వారు ఆలయానికి తిరిగి వచ్చిన తరువాత రాత్రి జ్వాలా తోరణం జరుగుతుందని తెలిపారు. నవంబరు 18న మాసశివరాత్రి ఉత్సవం, 20న అమావాస్యను పురస్కరించుకొని కోటి దీపోత్సవం, 21న పోలి పాడ్యమిని పురస్కరించుకొని స్వామివారికి జటాఝుటం అలంకరణతో ఉత్సవాలు ముగుస్తాయని ఈఓ వివరించారు. కార్తిక సోమవారాలలో తెల్లవారు జాము 4 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 వరకు తిరిగి సాయంత్రం 4 నుంచి రాత్రి 11 గంటల వరకు స్వామివారి దర్శనం ఉంటుందన్నారు. మిగిలిన రోజుల్లో ఉదయం 5 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సాయంత్రం 4 నుంచి రాత్రి10 గంటల వరకు స్వామివారి దర్శనం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, ట్రస్టు బోర్డు చైర్మన్ కంటే జగదీషమోహనరావు, మున్సిపల్ కమిషనర్ ఎ శ్రీవిద్య, సీఐ ఎ కృష్ణభగవాన్, కౌన్సిలర్ బలుసు వాసు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ అడబాల కుమారస్వామి, శానిటరీ ఇన్‌స్పెక్టరు రాజశేఖర్ జిల్లా మానవహక్కుల సంఘ అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ, ట్రస్టు బోర్డు సభ్యులు, ఆలయ పండితులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా



పెనుగుదురు, కరప గ్రామాల మధ్య పైపులైన్ లీకై వృథాగా పోతున్న తాగునీరు

కరప: మంచినీటి పైపులైన్ లీకవ్వడంతో తాగునీరు వృథాగా పోతోంది. పక్కనుంచి వెళుతున్న సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. కరప మండలం పెనుగుదురు కేఎంజే కెనాలు వద్ద నుంచి కరప, కొరుపల్లి, జెడ్.భావారం గ్రామాలకు పైపులైన్ ద్వారా తాగునీరు సరఫరా అవుతోంది. కాకినాడ-రామచంద్రపురం ప్రధాన రహదారు పక్క నుంచి మంచినీటి పైపులైన్లు వెళుతున్నాయి. పెనుగుదురు, కరప గ్రామాల మధ్య ఇందులో ఒక పైపులైన్‌కు కన్నంపడి తాగునీరు పక్కనే ఉన్న మురుగుకాలువలో కలుస్తోంది. మురికినీరు పైపులైన్‌లోకి వెళ్లి తాగునీరు కలుషితమవుతోంది. మండలానికి వచ్చే అధికారులందరూ ఈ రహదారి నుంచే కాకినాడకు రాకపోకలు సాగిస్తుంటారు. మంచినీటి పైపులైన్ నుంచి తాగునీరు లీకవుతున్న పట్టించుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. అధికారులు స్పందించి తాగునీరు వృథా కాకుండా పైపులైన లీక్‌ను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధిగా యార్లగడ్డ రామ్‌కుమార్



బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధిగా యార్లగడ్డ రామ్‌కుమార్‌ని నియమించారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. గతంలో ఆయన బీజేపీ యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులుగాను, యువమోర్చా జనరల్ సెక్రటరీగాను, యువమోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులుగాను, 2023 మీడియా ప్రతినిధిగా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించడంతో ఆయనకు రాష్ట్రమీడియా ప్రతినిధిగా మరోసారి అవకాశం కల్పించారు. మీడియా ప్రతినిధిగా ఎన్నికై నందుకు రామ్‌కుమార్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, సీనియర్ నాయకులు పైడా కృష్ణమోహన్, పైడా భవనప్రసాద్‌తోపాటు పలువురు అభినందించారు.

శిక్షణతో ఆర్థిక అభ్యున్నతి



శారీస్ స్క్రీన్ పెయింటింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలతో క్లబ్ ప్రతినిధులు

సామర్లకోట: మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఆలోచనతో స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శారిస్ స్క్రీన్ పెయింటింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ అధ్యక్షుడు డాక్టరు అమలకంటి శ్రీనివాసరావు అన్నారు. రెండు రోజుల పాటు లయన్స్ క్లబ్ భవనంలో మహిళలకు నిర్వహించిన ఉచిత శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాటన్ చీరలతోపాటు సాదా చీరలపై ఈ స్క్రీన్ పెయింటింగ్ వేయడంతో అందం ఉంటాయన్నారు. ఈ శిక్షణ పొందడానికి రూ.నాలుగు వేల నుంచి రూ.ఐదు వేల వరకు ఖర్చు అవుతుందని, లయన్స్ క్లబ్ ముందుకు వచ్చి ఈ ఉచిత శిక్షణ ఇస్తుందన్నారు. పేద ప్రజలకు సేవలు చేయాలనే లక్ష్యంతో లయన్స్ ఏర్పాటు చేసిన లక్ష్యాన్ని సాధించడానికి సామర్లకోట లయన్స్ క్లబ్ ముందజంలో ఉందని తెలిపారు. లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చిత్తూలూరి శ్రీనివాసరావు, కోశాధికారి యేలేటి రమేష్, మాజీ అధ్యక్షుడు గుండు శంకరరావు, మాజేటి కృష్ణ, బుర్రే కృష్ణమోహన్, కర్రి ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొనగా టీచర్లు బి జ్యోతి, వై.మాధవి శిక్షణ నిర్వహించారు. సుమారు 150 మంది శిక్షణ పొందారని శ్రీనివాసరావు తెలిపారు. శిక్షణ పొందిన మహిళలకు లయన్స్ క్లబ్ మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేశారు.

బాలుర హాస్టల్ తనిఖీ

సామర్లకోట: పెద్దాపురం లీగల్ సర్వీసు కమిటీ సభ్యులు శనివారం రాత్రి పెద్దాపురం సుధాకాలనీలోని బాలుర హాస్టల్‌ను తనిఖీ చేశారు. హాస్టల్ భోజనాలను పరిశీలించారు. ఈ మేరకు అన్నంతోపాటు కూరలు, సాంబారులను క్షుణంగా పరిశీలించారు.